'ఇప్పుడు మాత్రం యేమయిందే మాలతీ! కరిగి నీరయినప్పుడు ప్రవహించక మానుతుందా? ప్రవహించినప్పుడు మంచినీటి గుంటలో పడుతుందో, మురికి కూపంలో పడుతుందో దాన్నెలా ఆపుతావు?'

నా పేరు ఛాయ.

నేను మాలతి ఛాయను. అంటే మాలతి నీడను అని అనుకోకండి. చిన్నప్పుడు మా క్లాసులో ఇద్దరం ఛాయలు వుండేవాళ్ళం. నన్ను మాలతి ఛాయ అనీ,ఆ పిల్లను ఎత్తుపళ్ళ ఛాయఅనీ పిలిచేవారు. నేనూ,మాలతీ చిన్నప్పటినుంచీ స్నేహితులం. మా స్నేహం కాన్వెంటులో చదువుకొన్నప్పటి నుంచీ పుట్టి మాతోబాటే పెరిగింది.



నిజానికి మాలతిక్కి ఉన్నవేమీ నాకు లేవు. మాలతికి అపురూపమైన అందం ఉంది. అయితే నిధి కాకపోయినా రెండు తరాలపాటు నలుగురేసి ఆడపిల్లలని కని ఘనంగా కట్నాలిచ్చి పెళ్ళిచేయగలిగిన సిరీ సంపదా ఉన్నాయి. ఎగిరే గువ్వ పిట్టలా, మెరిసే వెలుతురు పువ్వులా.... ఇంతా ఇంకా అన్నీలా పెరిగింది అది.

# శిల ద్రవించిన తరువాత

'హరిప్రియ'

మంచు, పాలు, నెత్తురు, నిప్పు కలిసి రూపొందించిన శిల్పం అట అది. ఆ మాట ధానితో ఎవరన్నా అన్నారో, అదే అనుకుందో నాకు తెలియదు. నాకివి ఏమీ లేవు. నేను మామూలు అమ్మాయిని. వంద మంది ఆడపిల్లల్లో నే నొకతెను. వేల కొద్దీ ఎన్.జీ.వో.లలో మా నాన్న ఒకడు. అంతే. ఇవేమీ మా స్నేహానికి అడ్డురాలేదు. సరిసమానుల మధ్యనే స్నేహం ఉండాలనే రూల్ ఏమీ ఉన్నట్టు లేదు.


మేము ఒక కంచంలో తినలేదు. ఎవరి కంచాలు వాళ్ళకీ ఉన్నాయి. ఒక మంచం మీద కూడా పడుకోలేదు. ఎందుకనీ అంటే సామాన్యంగా ఎవరి ఇంట్లో వాళ్ళే పడుకునేవాళ్ళం. ఒకే క్లాసులో కూర్చుని రోజుల తరబడి పోట్లాడుకునే వాళ్ళం. కాకపోతే ఒకే వరండాలో కూర్చుని గంటల కొద్దీ మాట్లాడుకునేవాళ్ళం. ఒకళ్ళ మనసులో మాట ఇంకోళ్ళతో హాయిగా చెప్పుకునే వాళ్ళం. అందులోనూ మాలతి మరీ రహస్యాలను దాచుకోలేని పిచ్చి పిల్ల. ఇంతే అయితే కథ రాయ్యాల్సి రాకపోను.

మాలతి ఓణీలు వెయ్యటం మొదలు పెట్టినప్పటినుంచీ అబ్బాయిలు ఆశగా చూడడం నాకు తెలుసు. ఆ మాట కొస్తే నా బోటి వట్టి యావరేజ్ అమ్మాయినే చూస్తారు గదా! ఇంక మాలతిని చూశారంటే అందులో వింత ఏముంది? రకరకాల ప్రేమలేఖ లొచ్చేవి దానికి. కలిసి చదువుకొనేవాళ్ళం. నవ్వుకునే వాళ్ళం. దానికేమీ అనిపించేది కాదుట. నా కయితే వాళ్ళను చెంప వాయగొట్టాలని చేతులు మహా దురదగా ఉండేవి. అందులో మరీ కొన్ని చచ్చుగా దద్దమ్మలు రాసినట్టుగా ఉంటే, మరికొన్ని కాస్త హుందాగా ఉండేవి. అన్నింట్లోనూ సారాంశం ఒకటే.

ఇంక అసలు సంగతికి వద్దాం. వదహారేళ్ళు వచ్చినప్పటినుంచీ దానికి పెళ్ళి సంబంధాలు, చూపులు జరుగుతూనే ఉండేవి. ప్రతి సంబంధం తప్పిపోయే లాగానే ప్రవర్తించేది. పోనీ నీకు పెళ్ళి వద్దనుకుంటే ఆ మాట చెప్పెయ్యరాదా అంటే, అదంతా ఫన్నీగా, సరదాగా ఉంటాయనేది. ఇంక నా సంగతి.... నా కలా పెళ్ళి సంబంధాలు రానూలేదు. నేను.... సరేలెండి ఇంతకీ ఇది మాలతి కథ. నా కథకు దీనిలో ప్రమేయం ఏమీలేదు

మళ్ళీ అసలు సంగతికి వద్దాం. ఎంతమందో బెదరిపోయో, అదిరిపోయో పారిపోయిన తరువాత ఒక పెళ్ళికొడుకు విక్రమార్కుడల్లే నిఅదొక్కుకున్నాడు. ఐ. ఏ. యస్. ఉద్యోగి. వాళ్ళ నాన్నకు చాలా నచ్చాడట. అందుకే తనూ ఒప్పేసుకుందిట. నాన్నంటే తనకు ప్రాణంట. అందుకే తిరస్కరించలేకపోయిందట. మళ్ళీ అందుకనీ కాదుట— ఆ అబ్బాయి పెళ్ళికి ముందే ప్రేమలేఖ కూడా రాశాడట.

దీపావళి ప్రత్యేక సంచిక వస్తోంది!




వెల పది రూపాయలు పూర్తి ఆఫ్ సెట్ ముద్రణ

మీ ఏజెంటును ముందుగా మీ కాపీకై సంప్రదించండి.

అయినా సరదాగా ఈ ఫన్ కూడా చూద్దామనుకుందేమో పెళ్ళి అయింది.

ఓ సంవత్సరానికి అది కాపరానికి వెళ్ళింది. తమాషా ఏమిటంటే నాకూ ఓ చిన్న ఉద్యోగం వచ్చి నేనూ దానితోనే వెళ్ళాను— అంటే ఓ నెల ముందుగానే అనుకోండి. కనుక అక్కడా మా స్నేహానికి ఏమీ ఆటంకం రాలేదు. వాళ్ళాయన చాలా మంచివాడు. ఇది అంటే ఆయనకు ప్రాణం. ఎక్కడ నొచ్చుకుంటుందో అన్నట్టు అపురూపంగా చూసేవాడు. ఇద్దరూ కలిసి సినిమాలూ, షికార్లూ తిరిగే వాళ్ళు. ఇదీ ఇష్టంగానే ఉండేది. ఇంకెలా ఇష్టమో నాకు తెలియదు అనేది. ఆ మాటకు వస్తే సగటు ఆడపిల్లకు ఎవరికీ తెలియదు— తనంటే ఇష్టం చూపిస్తున్న వాళ్ళంటే తప్పకుండా ఇంటరెస్టు కలిగే తీరుతుంది ఎవరికయినా— ఇతర కారణం ఏమన్నా ఉంటే తప్ప.

ఇంత వరకే అయితే మాలతి కథలో ప్రత్యేకత ఏమీలేదు. ఇదంతా రాయాల్సి రాకపోను.

కాని అది భవానీ శంకర్‌ను చూడటంతో వచ్చింది ఇబ్బంది అంతా. భవానీ శంకర్ చక్కగా వీణ వాయిస్తాడుట. మామూలు డాక్టరు. అతనంటే దీనికి చచ్చే ఆకర్షణ పుట్టింది. ఎప్పటినుంచో ఉన్న అనుబంధం అనీ, జన్మాంతరం అనీ ఏవేవో పేర్లు పెట్టింది కాని, నాకు అసలు సూత్రం తెలుసు. అతను అసలు దానిని మొదట గమనించలేదు. గుర్తించనూలేదు. ఆ ఇన్‌డిఫరెన్సు దానికి కొత్త. విప్రనారాయణుడు చూడకుండాపోతే దేవదేవికి కలిగిన అనుభూతిలాంటిదేదో దీనికీ కలిగిందని నా నమ్మకం.

తరువాత కథ బ్రహ్మాండమైన స్పీడు అందుకుంది

దీని హృదయంలో సవ్వడి ఏదో మధురంగా వినిపించిందిట. అజ్ఞానంలాంటి జడత్వంలోనుంచి మూర్ఖత్వంలాంటి జడత్వంలోనుంచి చైతన్య కాంతిపుంజం కనిపించిందట. ఇప్పుడే పుట్టినట్టు తొలిసారి సంవేదించినట్టుగా యింకా ఏదో ఏదోగా అనిపించిందట.

ఆ భవానీ శంకర్ చాలా గడుసువాడిలాగానే వున్నాడు. దీనికి యిష్టమైన మాటలు చక్కగా జాగ్రత్తగా కూర్చుకున్నాడు. వీణ, వయొలిన్ కలిసిన కొత్త వాద్యంలా వుంటుందట దాని గొంతు. సంగీతం ఘనీభవిస్తే దాని శరీరంలా అయి కలవర పెడుతుంది. అస్తిత్వం స్పందిస్తే దానిలాగా సాన్నిధ్యిస్తుందిట అని సాహిత్యించేవారుట. ఈ సాన్నిధ్యంచటం. సాహిత్యంచటం సంవేదించటం— ఇవన్నీ ఏమిటని అడక్కండి. ఎంతయినా డాక్టరుకదా ఏ ముక్క అయినా కోయనూగలడు. అతుకు పెట్టనూ గలడు

ప్రణయం ఇంకా కాస్త ముదురు పాకంలో పడింది. భౌతికమూ, అభౌతికమూ, చలనమూ, అచలనమూ, నీరు, నిప్పు కలిసే వైరుధ్య బిందువుట అది. తన అజ్ఞాత దార్శనిక రసాన్వేషణదానిలో దర్శించారుట. ఈ డైలాగులన్నీ అది చెపితేనే నాకు తెలిశాయి. ఆ మాటలు సరిగా పలకటమే రాదు, ఇంక అర్థం ఏం చేసుకోగలను-నేను. నా మొహం! తన ఇల్లూ, సంసారం, సంఘం అన్నీ పణంగా పెట్టి గెలుచుకుంటుందట అతన్ని. మళ్ళీ ఇందులో చిన్న సవరణ. నాన్నను వదులుకోదుట. పైగా ఈ చపలత్వం దానికి గర్వంగా అనిపించింది. శిల ద్రవించిందని పొంగిపోతూ చెప్పింది గుడ్. ఇంకచెప్పాల్సిందేమీ లేదు. ఈనాటకాన్ని చివరివరకూ కన్నుల పండగగా చూడాలని వేచిఉన్నాను నేను.

రోజూ అతని క్లినిక్‌కివెళ్ళేది. ఆపిల్ పండో మిఠాయిపొట్లమో పుచ్చుకొని అందంగా అలంకరించుకొని రోజుకోచీర కట్టుకునీ- మళ్ళీ ఆ చీరలూ అవీ మొగుడు కొనిచ్చినవే. గంటలకొద్దీ మాట్లాడుకునే వాళ్ళుట— పుట్టినరోజున వేళతో తాకాడుట- మరి ఇంకా ఏం మాట్లాడుకొనే వాళ్ళో ఆ మందుసీసాలకూ, గోడలకే తెలియాలి. దేనినీ లెక్క చెయ్యటంలేదు. ఇదీ బాగానేఉంది. ఇలా సాగింది కొన్నాళ్ళు.

ఓసారి మూడురోజులు కాబోలు అతను క్లినిక్ కిరాలేదు. దీనికిగంగవెర్రులెత్తింది. ఇల్లు తెలీదేమో లేకపోతే ఇంటికి వరుగెత్తుకుని పోయేదే. పిచ్చిపట్టినట్లు గంటల తరబడి ఆ మూసిన తలుపులను చూస్తూ నిలబడిపోయేది. తలుపుకిఉన్న నేమ్ ప్లేట్ మీద ఉన్న అక్షరాలను చిటికినవేలుతో సుతారంగా తడిమి తన పెదవులకు తాకించుకొనేది. అతను కూర్చున్న కుర్చీ కిటికీ సందులోంచి చూడాలనీ చూస్తూ అలా కూర్చునేది. ఇంకానయమే. అతను ఏ చెప్పులన్నా వాకిట్లో మరచిపోయి వెళ్ళిపోయి ఉంటే కళ్ళకు అద్దుకొనేదేమో కూడా.

నాలుగోరోజు వచ్చి క్లినిక్ తెరిచాడట. ఇంకా తెల్లవారి ఏడన్నా అయిందో లేదో పనిమనిషిచేత నేలంతా తుడిపిస్తున్నాడు. అంతే. ఇది ప్రత్యక్షమయింది అక్కడ. రేగిన తల, ఎర్రబడ్డ కళ్ళు, పీక్కుపోయిన మొహం. కళ్ళల్లోనే ఆరాధన అంతా అలా ఒంపుకొని చేతులు రెండూ పట్టుకుని 'భవానీ' అంటూ ఏడుస్తూ [illegible]లోకి వెళ్ళిపోయిందిట. [illegible] నాకాలు చీపురు అక్కడ

పారేసి నడుమున చేతులు పెట్టుకొని టికెట్టు లేకుండా సినిమాను ఎంత ఆనందంతో చూసిందోనని అనుకుంటూ ఉంటాను. అతను ముందు గాభరాపడ్డాడు. తర్వాత చిరాకుపడ్డాడేమో. 'ఏమిటి. ఏమయింది? ఏమిటీ అవతారం?' అన్నాడు. ఎక్కడికి వెళ్ళావు? నే నేమవుతాననుకున్నావు. అని ఏవేవో అడిగినట్టుందిది.

"అనుకోకుండా మా మరదలి పెళ్ళి అని టెలిగ్రాం వచ్చింది. నేను మా ఆవిడా, పిల్లలతో వెళ్ళాం."

ఇంతలో ఏం మునిగిపోయింది?

దీని నెత్తిన పిడుగుపడింది.

"నువ్వామీఆవిడానా?" అంది నూతిలోనుంచి వచ్చినట్టున్న గొంతుకతో.

"ఏమిటలా ఆకాశంలోనుంచి వూడిపడ్డట్టు మాట్లాడుతున్నావు. మా ఆవిడ వుందని నీకు తెలియదా?" అన్నాడు.

"నాతో మాట్లాడటంకంటె నీకుమరదలి పెళ్ళి యెక్కువా భవానీ! నాతో కలిసి కూర్చోవటంకంటె మీ ఆవిడతో కలిసి వెళ్ళటమే నీకు బాగుంటుందా భవానీ!"

మతిపోయిం దనుకుంటా ఆ మానవుడికి దీని మాటలతో.

"ఇంతకీ ఏమిటి నువ్వు అనేది? నాకేం తెలియటంలా!"

"ఈ మనసూ,తనవూ నీది. నా అస్తిత్వం నీది. ఈ నిజాయితీకి, స్వచ్ఛతకు నే నెంత సుంకం చెల్లించాలో. చెల్లిస్తున్నానో నీకు తెలీదా? ఐశ్వర్యం,సంఘం, ఐనవాళ్ళూ అందరినీ వదులుకున్నాను."

జ్వరంలో సంధి పుట్టినట్లే పేలిందిట ఇది.

అన్నీ ఓపికగా విన్నాడు భవానీ శంకరం. ఏమీ అనకుండా కుర్చీలో కూర్చున్నాడు.

నూకాలుచేత రెండు కప్పులు కాఫీ తెప్పించాడు. మాలతికి ఒకటి ఇచ్చి తనొకటి తాగాడు.

మెల్లగా దానికి కొంత బాలెన్సువచ్చాక మొదలుపెట్టాడు.

"నిజం మాలతీ. నీవుచెప్పినవన్నీకరెక్టే దేన్నీ నేను కాదనను? అన్నీ నా కోసం వొదులు కుంటున్నా నంటున్నావు. బాగానే వుంది. అయితే నువ్వు వదులుకుంటే మీ ఆయనకేమీ నష్టం లేదు.

ఐశ్వర్యానికీ, సంఘానికీ, ఐనవాళ్ళకీ పోయేదేమీ లేదు. క్యూలో నిలబడి మరీ యిస్తారు ఆడపిల్లలను మీ వారికి.

ఇంక నా సంగతి. నేను వదిలేస్తే మా ఆవిడ ఏమవుతుంది? ఆవిడేమీ ఉద్యోగస్తురాలూ కాదు. పుట్టింటివారు సంపన్నులూ కాదు. నా యిద్దరు పిల్లలూ ఏమవుతారు? వాళ్ళను అలా గాలికి వదిలేసి నీతో సుఖంగా వుండగలనా. అలాంటి నీచుడిని నీవు ప్రేమించగలవా? నేను వదిలినా అవేమీ నన్ను వదలవు. అసలే అంతంత మాత్రం నా సంపాదన.

రెండు కాపరాలు అనే మాట అసలు విని ఎలా భరించగలవు ముందది చెప్పు."

"అయితే,నన్నింత వరకూ ఎందుకు?"

"రానిచ్చావు అంటున్నావు కదూ. నేనేమీ నీ కోసం పరుగెత్తలేదే. ఏమీ దాచిపెట్టనూ లేదు. నేను దేనికీ తాపత్రయపడను. స్వీకరించను. వదిలిపెట్టను. వస్తే కాదనను."

ఆహా ఎంత చక్కని అవకాశవాదం అనుకుంటారు మీరెవరన్నా అయితే—

"నీఅజ్ఞాత అన్వేషణ నాకోసమే అనుకున్నా భవానీ. నీవు చలించి స్పందించి ఆరాధించే వ్యక్తిని నేనే అనుకున్నాను భవానీ,"

"నిజం మాలతీ. అందులో సందేహం ఏమీ లేదు. ఒక్కమాట అర్థంచేసుకో మాలతి, నేను అంటే ఈ భవానీని చుట్టూ ఉన్న మనుష్యులనుంచీ, ప్రపంచం నుంచీ విడదిసి చూడాలి అనుకోకు. తన చుట్టుపక్కలవాళ్లు, అన్నదమ్ములు, స్నేహితులు అంతా కలిస్తేనే మనిషికి అస్తిత్వం అంటూ వస్తుంది. నేను పీల్చే గాలీ, తాగే నీళ్ళూ లేకపోతే నేను లేనేలేను. అలా గాలీ,నీళ్ళూ అక్కర్లేనిది బొమ్మన్నా అవుతుంది, నిర్జీవమైనదైనా అవుతుంది. బొమ్మతో ఎన్నాళ్లు ఆడుకోగలరు. ఇంకోటి ఆలోచించు.

నువ్వే అన్నావు. నాకోసం సుంకం చెల్లించాననీ.ఏదో అనీ. అసలామాటకు అర్థం ఏమిటీ?రెండు విలువలనూ బేరీజు వేసి తూచుకున్నావు అన్నమాటేగా. అలాగే నేను. నేను కాకపోతే మరొకళ్ళు. రెండో విలువకు ఎక్కువ తూకం కట్టితే ఎలా తప్పుపట్టగలవు!"

ఇలా వాదనలోకి దిగిందిట ప్రణయం.

ఇదంతా నాతో చెప్పి బోరుమన్నది మాలతి.

"శిల కరిగిం దనుకున్నానే ఛాయా! మనసులోని మంచుపొరలు విడిపోయాయి అనే అనుకున్నాను" అని యేదేదో చెప్పుకుంది నాతో

"ఇప్పుడుమాత్రంయేమయిందేమాలతీ కరిగి నీరయినప్పుడు ప్రవహించక మానుతుందా! ప్రవహించినప్పుడు మంచినీటి గుంటలో పడుతుందో మురికి కూపంలో పడుతుందో! దాన్నెలా ఆపుతావు?" అన్నాను.

"అవును" అంది మాలతి నిర్లిప్తంగా.

[15-5-81 "ఆంధ్రజ్యోతి" వారపత్రికలో వడ్డెర చండీదాసుగారి 'ద్రవించిన శిల' చదివిన తరువాత బుద్ధిపుట్టి వ్రాసిన కథ యిది. చండీదాసుగారికి కృతజ్ఞతలతో, క్షమాపణలతో.]

భాగ్యదేవత వస్త్రలక్ష్మి రూపంలో
మీ ముందుకు వస్తోంది

తెనాలి రాధామాధవ్ విమల్ షో రూంలో Sept 29 నుంచి Oct 28 లోగా మీ ఇష్టం వచ్చిన రోజున మీకు కావలసిన వస్త్రాలు కొనండి. ఈ 30 రోజులలో ఒక రోజున అదృష్టపు రోజుగా Lucky dip నిర్ణయిస్తుంది. Lucky day నాడు బటలు కొన్నవారందరికి మీ బిల్లుతో సమానంగా ఉచితంగా మళ్ళీ వస్త్రాలు ఇవ్వబడతాయి.

మీరూ దర్శించండి

VIMAL
A RELIANCE PRODUCT

రాధా మాధవ్
విమల్ షో రూం
బోస్ రోడ్డు, తెనాలి.